క్లుప్తంగా

ఘనంగా పీవీ జయంతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప వ్యక్తి అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నెదునూరి అశోక్, జావిద్, మధన్‌రావు, షేక్ జావిద్, గవాలే సతీశ్, కైలాస్, దస్తగిర్ పాల్గొన్నారు.

జొన్న పంట డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న గండ్రత్ సుజాత

ఆదిలాబాద్‌టౌన్: జొన్న పంట విక్రయించిన రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మాట్లాడారు. ప్రభుత్వం 72 గంటల్లో డబ్బులు చెల్లిస్తామని చెప్పినా.. 20 రోజులు గడుస్తున్నా ఎలాంటి చెల్లింపులు చేయలేదన్నారు. జూన్ 9 నుంచి 27వరకు జొన్న కొనుగోళ్లు జరిపిన ప్రభుత్వం నేటికీ డబ్బులు చెల్లించలేదన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘గోవులను వధిస్తే చర్యలు తీసుకోవాలి’

బేల: గోవులను వధిస్తే చర్యలు తీసుకోవాలని భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు అగర్కార్ అకాష్ డిమాండ్ చేశారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై లింగన్నకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ రోజు గోవులను వధించడం నిషేధించాలన్నారు. కార్యక్రమంలో బర్కాడే రాము, ప్రీతం, అనికేత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

‘వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం’

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కనీస వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి జుగ్నక సునీత ఆరోపించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో పర్యటించారు. గ్రామస్తులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలకు ఉండేందుకు ఇల్లు లేదని, తాగునీరు, డ్రైయినేజీలు, రోడ్లు వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్లు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆమె వెంట నూర్జా, లక్ష్మి, రంజన పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో చేర్పించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

ఇంద్రవెల్లి: చిన్నారులను ప్రభుత్వ బడిలో చేర్పించి ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ సాంబశివరావ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు వడగామ్, హీరాపూర్, అందునాయక్‌తండా గ్రామాల్లో సందర్శించి ఉపాధ్యాయులతో కలిసి బాలల హక్కులను కాపాడాలని నినాదంతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌సింగ్ తీలవత్, గేడం భరత్, జాదవ్ మాన్సింగ్, జగదీష్, జాదవ్ రవీంద్రాచారి, బాపురావ్ పాల్గొన్నారు.

సంతోషంగా పండుగ జరుపుకోవాలి

నేరడిగొండ: నిరుపేద ముస్లిం కుటుంబాలు సంతోషంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని నేరడిగొండ లీడ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఎండీ సద్దాం, షేక్ వాజిద్‌లు అన్నారు. పండుగ సామగ్రితో కూడిన కిట్లను 40 కుటుంబాలకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సయ్యద్ సాబీర్, సయ్యద్ ఖైస్, మహమ్మద్ యూసుఫ్, షేక్ అర్షద్, సయ్యద్ పర్వేజ్, సయ్యద్ మాజర్ పాల్గొన్నారు.

తాగుబోతులకు అడ్డాగా పాఠశాల

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ తాగుబోతులకు అడ్డాగా మారింది. గత కొన్ని రోజులుగా రాత్రిపూట మందుబాబులు పాఠశాల ఆవరణలో మద్యం సేవిస్తున్నారు. అంతే కాకుండా సీసాలను పగులగొడుతున్నారు. ఉదయం పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కాళ్లలో గుచ్చుకోని హాని కలిగే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

రోడ్లు ఇలా.. నడిచేదెలా?



బోథ్: బురదమయంగా నిగిని రోడ్డు



ఇచ్చోడ: అడేగామ (కె)లో రోడ్డుపై నిలిచిన వరద

బోథ్ నుంచి నిగిని గ్రామం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. బోథ్ నుంచి కిలో మీటరు వరకు పాత రోడ్డును తవ్వివేశారు. దీంతో రోడ్డంతా బురదమంగా మారుతోంది. అలాగే ఇచ్చోడ మండలం సోనాలకు వెళ్లే రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇంద్రవెల్లి పోల్లుగూడ, లింగపూర్, ఖైర్‌గూడ, మామిడిగూడ, సకారంతండా, చిత్తబట్ట గ్రామాల రోడ్లు చిత్తడిగా మారి, నడిచేందుకు కూడా వీలు ఉండడం లేదు. అత్యవసర సమయంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేయాలని ప్రజలు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – బోథ్/ఇచ్చోడ/ఇంద్రవెల్లి



ఇంద్రవెల్లి: బురదమయంగా పోల్లుగూడ రోడ్డు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: ప్రభుత్వం రైతు ఖాతాలో రైతుబంధు డబ్బులు జమ చేసినందున అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఇమ్రాన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. డబ్బులు తీసుకోవటానికి సీఎస్పీ సెంటర్, ఆన్‌లైన్ సెంటర్లకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. డబ్బులు తీసుకున్న తర్వాత రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ పోచన్న, గోపాల్, నాగేశ్వర్, విజయ సాగర్, పెందూరు సంతోశ్ పాల్గొన్నారు.

పల్లకి ఊరేగింపు

బేల: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని కాంఘుర్‌పూర్ గ్రామం నుంచి ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా శిష్యులు బుధవారం మహారాష్ట్రలోని సుక్నేగావ్‌కు పాదయాత్రగా పల్లకితో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకిని ప్రారంభించారు. ఆయా గ్రామాల మీదుగా వెళ్లి, వచ్చే నెల 3న సుక్నేగావ్‌లో జరిగే గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్కర్ తేజ్‌రావు, ప్రధాన శిష్యులు ఠాక్రే మధుకర్, డాలే ప్రభాకర్, చర్దే నానాజీ, వడ్కే సురేశ్, డాలే అతుల్, తదితరులు పాల్గొన్నారు.

కరెంటుతో జర భద్రం

- వర్షాకాలంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికే ముప్పు
- కొద్దిపాటి జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



నేరడిగొండ: వర్షాకాలంలో రైతులు కరెంటుతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇళ్ల వద్ద, పంట పొలాల్లో విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో విద్యుత్‌తో బోరుబావులు, వాగుల వద్ద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి పంటలు సాగు చేస్తారు. విద్యుత్ వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా.. ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈసమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే మేలని నేరడిగొండ విద్యుత్‌శాఖ ఏఈ నాగేంద్ర ప్రసాద్ వివరించారు.

మూడింటికే పరిహారం..

విద్యుత్ సంస్థలు కేవలం మూడు రకాల ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అందిస్తాయి. మనుషులు, పశువులు మరణిస్తే సాయం అందుతుంది. గాయాలకు పరిహారం ఉండదు. మనుషులకు అయితే రూ.5 లక్షలు, పశువులకైతే రూ.40 వేలు, మేకలు, గొర్రెలకు రూ.7 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తారు. ఏదైన ప్రమాదం జరిగిన స్థలంలోని చిత్రం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువులకైతే ఫొటోతో పాటు పశు వైద్యుడి పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందించాల్సి ఉంటుంది.

నష్టపరిహారం ఇలా..

- ఆకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగి కింద పడినప్పుడు వాటికి తగిలి మనుషులు, పశువులు మరణిస్తే నష్ట పరిహారం ఇస్తారు.
- ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు వాటికి తగిలి చనిపోతే నష్టపరిహారం అందుతుంది.
- తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడితే నష్ట పరిహారం ఇస్తారు.

పాటించాల్సినవి ఇవి..

- మోటార్లను నేలపై కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెలపై ఏర్పాటు చేయాలి. స్టార్టర్ బోర్డును తడవకుండా చూడాలి.
- మోటారు పాడైతే మెకానిక్‌లతోనే మరమ్మతులు చేయించాలి. సొంతగా ప్రయత్నించవచ్చు.
- సర్వీసు వైర్లను, మోటార్లకు వాడే తీగలు నాణ్యమైనవి వాడాలి. వైర్లు దెబ్బతింటే వెంటనే టేపు వేయాలి.
- సబ్ మెర్సిబుల్ మోటారుతో పాటు విద్యుత్ వైర్ ఉంటుంది. ఏ కొంచం వైర్లు తెగి ఉన్నా.. మోటార్ నుంచి పైన ఉండే వస్తువులకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంటుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. తీగలు తెగిపడినా, కిందకు వేలాడినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలి. ఆన్, ఆఫ్ స్విచ్‌లు వేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.
– నాగేంద్ర ప్రసాద్, విద్యుత్‌శాఖ, ఏఈ

పార్టీ సిద్ధాంతాలు నచ్చే కాంగ్రెస్‌లో చేరికలు

- డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్



కాంగ్రెస్ డిక్లరేషన్ గురించి వివరిస్తున్న సాజిద్ ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ సిద్ధాంతాలు నచ్చే పలువురు పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. బుధవారం పట్టణంలోని తాటిగూడ, ఖుర్షీద్‌నగర్‌కు చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ.. రోజురోజుకూ తెలంగాణలో కాంగ్రెస్ బలపడుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నగేశ్, ఇర్ఫాన్, రాజు, సంతోశ్, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే..

పేద ప్రజలకు ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. గడప గడపకూ కాంగ్రెస్‌లో భాగంగా బుధవారం పట్టణంలోని బృందావన్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. 15 సంవత్సరాల క్రితం ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లే ఉన్నాయన్నారు. ఇందిరమ్మ కాలనీ ఏర్పాడి సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటికీ అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, నగేశ్, ప్రభాకర్, మోసిన్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న కిరణ్

తాంసి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మె సన్నాహక మండల సమావేశం నిర్వహించారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్మికులకు ప్రస్తుతం ఇచ్చే వేతనాలు సరిపోక అనేక ఆర్థిక ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే జూలై 6నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆశన్న, మండల అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి ప్రమోద్, కార్మికులు దత్తు, రాజు, శ్రీనివాస్, నర్సింగ్ పాల్గొన్నారు.

‘సహకార’ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

తాంసి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న వ్యవసాయ రుణాలు, వ్యవసాయేతర రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రైతులకు విత్తనాలతో పాటు ఎరువులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. డీసీసీబీ బ్యాంకు ద్వారా అందించే రుణాలకు వడ్డీరేట్లు తక్కువ ఉన్నందున్న సకాలంలో చెల్లించాలని సూచించారు. భీంపూర్ మండల కేంద్రంలో నూతనంగా బ్యాంకును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, సొసైటీ సీఈవో కేశవ్, డైరెక్టర్లు బుజ్జన్న, కవిత, ఆశన్న, నారాయణ రెడ్డి, కార్యదర్శులు సిద్దార్థ్ రెడ్డి, గణేష్, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ప్రమాద బీమా



బీమా నమోదు చేయిస్తున్న నాయకులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె)లో బుధవారం ఇచ్చోడ సీఎస్సీ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రమాద బీమా పథకంలో పేరు నమోదు చేయించారు. పథకంలో చేరిన ప్రతిఒక్కరికీ సర్పంచ్ గాడ్గేమీనాక్షి సొంతగా ప్రీమియం చెల్లించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో అర్హులైన ప్రతిఒక్కరూ బీమా కలిగి ఉండాలన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గే సుభాష్, సీఎస్సీ జిల్లా మేనేజర్ రాహుల్, సీఎస్సీ నిర్వాహకుడు కొండ ప్రశాంత్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలోని రైతువేదిక భవన్‌లో బుధవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సాదాసీదాగా సాగింది. సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది మాత్రమే పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. గాదిగూడ మండలంలో 25 గ్రామ పంచాయతీ పరిధిలో 2020– 2022 సంవత్సరంలో రూ.10.5 కోట్లతో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాలకు వెళ్లి పరిశీలించడం జరిగిందన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఆర్డీవో అదనపు పీడీ రాథోడ్ రవీందర్, వీణా, ఎంపీపీ ఆడ చంద్రకళ రాజు, ఎంపీడీవో రామేశ్వర్, ఈజీఎస్ ఏపీవో పవర్ నితిన్, సర్పంచ్ మెస్రం జైవంతరావు పాల్గొన్నారు.

టీకాలపై ఇంటింటా సర్వే

తాంసి: భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టారు. గర్భిణులకు, శిశువులకు, సకాలంలో టీకాలు వేయించాలని అవగాహన కల్పించారు. అర్లి, భీంపూర్, గిరిగాం గ్రామాల్లో హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల ఇంటింటికీ తిరుగుతూ.. అవగాహన కల్పించారు. వారి వెంట ఏఎన్ఎం సరస్వతి, ఆశ కార్యకర్తలు నఫీజా, గోదావరి ఉన్నారు.

ఆర్థిక సాయం

నార్నూర్: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన దుండగులు భీమన్న కుమార్తె వివాహానికి సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ రూ. 10,000ల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఏ సమస్య వచ్చినా.. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట గుంజ చిన్నయ్య, రాజీ, ఎల్లయ్య, రెడ్డి, శీను, రాజు పాల్గొన్నారు.

రోడ్డుపై పశువుల సంచారం

బోథ్: మండల కేంద్రంలో పశువుల బెడద తీవ్రమైంది. రోడ్డుపైనే పశువులను వదిలేయడంతో చిన్న పిల్లలు, వృద్ధులు, దుకాణదారులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ఎన్నిసార్లు చెప్పినా... యజమానులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికై నా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

ఎమ్మెల్యే పరామర్శ

జైనథ్: మండలంలోని బెల్లూరి గ్రామానికి చెందిన బాపురెడ్డి కుటుంబసభ్యులను, పిప్పల్‌గావ్ గ్రామానికి చెందిన కిషన్ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే జోగు రామన్న బుధవారం పరామర్శించారు. బాపురెడ్డి, కిషన్‌ల చిత్రపటాలను వేర్వేరుగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పంచ్ లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌అర్బన్: బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త నవాతే శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురి కాగా.. తలకు గాయమైంది. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసానికి చేరుకొని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పట్టణ అధ్యక్షుడు అజయ్, అష్రఫ్, దుర్గం శేఖర్ ఉన్నారు.

ఈటలను కలిసిన బలరాం జాదవ్

నేరడిగొండ: హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. రాష్ట్ర రాజకీయలపై చర్చించారు.

వీర జవాన్‌కు నివాళి

బేల: మండల కేంద్రంలోని మార్కెట్ కూడలిలో బుధవారం వీర జవాను బిజేందర్ కుమార్ శర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎస్సై క్రిష్ణకుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్, నాయకులు సతీశ్ పవార్, బోనిగిరివార్ గణేశ్, జవాను కుటుంబసభ్యులు రాదేశ్యాం, రజనీ, అశోక్ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో పాల్గొనాలి

బేల: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దహెగాంలో క్విజ్ పోటీలపై అవగాహన కల్పించారు. వచ్చే నెల 2న నిర్వహించే ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు ఎండీ అఖిల్, మడావి చంద్రకాంత్, ఠాక్రే, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దు..

బోథ్: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోథ్ సీఐ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ మీటర్లను ముట్టవద్దన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తాకరాదన్నారు. పొడిగా ఉన్న కర్రల చేతనే స్విచ్ ఆన్ చేయాలని సూచించారు. చిన్న పిల్లలను విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే 108, 100కు డయల్ చేయాలన్నారు.

బీమా డబ్బులు అందజేత

తలమడుగు: మండలంలోని చెర్లపల్లి గ్రామానికి చెందిన తుము సురేందర్ గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మరణించాడు. లోటస్ రైతుసేవా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వరంగా సంస్థ అయినా ఇఫ్కో కంపెనీకి చెందిన పురుగుల మందులు కొనుగోలు చేశాడు. ఇఫ్కో కంపెనీకి చెందిన ఏ వస్తువు కొన్న, ఉచిత బీమా వర్తిస్తుందని, ఆగ్రో ప్రతినిధి గండ్రత్ సంతోశ్ కంపెనీకి తెలియజేసి, కంపెనీకి పంపిచాడు. రూ. 53,000 పరిహారం అందజేశాడు. ఇఫ్కో కంపెనీ రీజినల్ మేనేజర్ ఆంజనేయులు, కంపెనీ ప్రతినిధులు చలపతి, సంతోశ్, గండ్రత్ సంతోశ్, డీలర్స్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నార్నూర్: వర్షాకాలం విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కస్తూర్బా గాంధీ పాఠశాల సెక్టోరియల్ జిల్లా అధికారి ఉదయ్‌శ్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. గోదాంలోని నిత్యావసర సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటర్ జాబితాలో తప్పులుంటే సవరించుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

తలమడుగు: ఓటర్ జాబితాలో తప్పులు ఉంటే సవరించుకోవాలని తహసీల్దార్ వనజారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వీఆర్ఏలతో, బూత్‌లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే మరణించిన వారి పేర్లను తొలగించాలని, పెళ్లి అయిన వారి వివరాలు ఫారం 7లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏలు, బూల్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.